క్లుప్తంగా

నర్సరీని సందర్శించిన మహాలింగ్ స్వామీజీ



నర్సరీని మొక్కలను పరిశీలిస్తున్న మహాలింగ్ స్వామిజీ

కడియం: కడియపులంకలోని శ్రీసత్యదేవ నర్సరీని కర్ణాటకకు చెందిన హరిమాత్ సంస్థ మహాలింగ్ స్వామీజీ సోమవారం సందర్శించారు. ఆయనకు నర్సరీ యజమాని వీరవెంకట్రావు స్వాగతం పలికి వివిధ రకాల మొక్కల గురించి వివరించారు. స్థానిక రైతులు ఎంతో నైపుణ్యంతో మొక్కలను అభివృద్ధి చేస్తున్నారని స్వామీజీ అభినందించారు. కార్యక్రమంలో పుల్లా చిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

సీటీఆర్ఐ: స్థానిక చందా సత్రం పునరావాస కేంద్రంలో ఉన్న వరద బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రూ.3 వేల పరిహారంతో పాటు నిత్యావసర సరకులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఇసుకపట్ల రాంబాబు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు ఇసుకపట్ల రాంబాబు అన్నారు. మంగళవారం బొమ్మూరులోని బత్తిన సుబ్బారావు కమ్యూనిటీ హాల్‌లో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు ఇసుకపట్ల రాంబాబు, నక్కా వెంకటరత్నరాజు, సుందరపల్లి అనిల్ తదితరులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును దేశమంతా ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో నక్కా విజయ్ కుమార్, కోనాల లాజర్, దాకే శ్రీనివాస్, చెల్లయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పడాల వీరభద్రరావు మృతి



రాజమహేంద్రవరం సిటీ: అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు(72) మంగళవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కాకినాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అల్లూరి సీతారామరాజు విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఆయన ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు. పడాల మృతిపై వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సంతాపం ప్రకటించారు.

ధవళేశ్వరంలో స్వచ్ఛతాహీ సేవా ర్యాలీ



ధవళేశ్వరంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

ధవళేశ్వరం: స్వచ్ఛతాహీ సేవా ర్యాలీని మంగళవారం ధవళేశ్వరంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి బ్యారేజ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించి ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కేఎస్ జ్యోతి, ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, విస్తరణాధికారి డి.బాబూరావు, పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

40 మంది స్టాఫ్ నర్సుల భర్తీ

కంబాలచెరువు: ఆరోగ్యశాఖలో 40 మంది స్టాఫ్ నర్సుల భర్తీ ప్రక్రియ మంగళవారం జరిగింది. గతంలో వెలువరించిన నోటిఫికేషన్‌కు సంబంధించి రాజమండ్రి ఆర్డీ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ నియామకాల ప్రక్రియ జరిగింది.

చెత్తకుప్పలే స్వాగత ద్వారాలు

- గ్రామాగ్రామాన రోడ్ల పక్కనే దర్శనమిస్తున్న చెత్త
- స్వచ్ఛతాహి సేవ ఆచరణలో సాధ్యమేనా అన్న సందేహాలు



కడియపులంక వద్ద కోటిపల్లి కాలువ సమీపంలో వంతెనపై వేసిన చెత్త



చెత్తలో కూరుకుపోయిన కడియపులంక కైలాసభూమి

కడియం: ఆవాస ప్రాంతాల్లో పరిశుభ్రతను నెలకొల్పడమే స్వచ్ఛతాహి సేవ కార్యక్రమ లక్ష్యం. దీని కోసం జిల్లా కలెక్టర్ స్థాయిలో పర్యవేక్షిస్తూ గ్రామ స్థాయి వరకూ పలు కార్యక్రమాలను అమలుచేస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది కాని క్షేత్ర స్థాయిలో పరిస్థితులను చూస్తే ఇది కూడా ప్రచార ఆర్భాట కార్యక్రమంగానే మిగిలిపోతుందేమోనన్న సందేహం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఏ గ్రామానికి వెళ్లాలన్నా స్వాగత ద్వారాలుగా చెత్తకుప్పలే దర్శనమిస్తుండడమే దానికి కారణం.

ఎక్కడ చూసినా చెత్తే

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రోడ్ల పక్కన భారీ ఎత్తున చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. దాదాపు ప్రతి గ్రామంలోనూ నిర్మించిన «చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు» ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి నిలువుటద్దాలుగా నిలుస్తున్నాయి. జనావాసాల నుంచి చెత్తను సేకరించి తడిచెత్త, పొడి చెత్తలుగా విడదీయడం అన్న ప్రక్రియ ఏ గ్రామంలోనూ కొనసాగడం లేదు. వీధుల్లోకి అప్పుడప్పుడు వస్తున్న చెత్త బళ్లలోకి అన్ని రకాల చెత్తలను కలిపి తీసుకెళ్లి గ్రామ శివార్లలో పారబోసి నిప్పు పెట్టేస్తున్నారు. దీనివల్ల విపరీతమైన వాయుకాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. అంతేకాకుండా ఇటువంటి చెత్తను కాల్చిన బూడిద వర్షాల సమయంలో పంట కాలువల్లోకి చేరి తద్వారా వ్యవసాయ క్షేత్రాలను ముంచెత్తుతోంది.

క్షేత్ర స్థాయిలో ఇదీ పరిస్థితి

- కడియం మండలం కడియపులంక జాతీయ రహదారి పక్కనే చెత్త నుంచి సంపద కేంద్రం చుట్టూ చెత్తను పారేస్తున్నారు. అంతేకాకుండా ఈ కేంద్రం సమీపంలోనే కోటిపల్లి కాలువపై గల వంతెనపైకి వెళ్లే రోడ్డు మొత్తం చెత్తకుప్పలతో కప్పేశారు. అక్కడే ఉన్న కైలాస భూమి సైతం చెత్తలో మునిగిపోయింది.
- నిత్యం కడియపులంక రోడ్డుమీదుగా రాకపోకలు సాగించే నర్సరీ రైతులు వంతెనపై చెత్త వేయడాన్ని ప్రశ్నించగా జేసీబీ వస్తోందని, పక్కకు గెంటేస్తారని చెబుతున్నారు. అంతే తప్పితే గత వారం రోజులుగా జేసీబీ వచ్చిందీ లేదు, చెత్తను పక్కకు జరిపిందీ లేదని నర్సరీ రైతులు చెబుతున్నారు. పైగా టూరిజం అభివృద్ధిలో భాగంగా ఈ కోటిపల్లి కాలువలోనే బోటింగ్ ఏర్పాటు చేస్తున్నామంటూ అధికారులు, నాయకులు హడావుడి చేస్తుండడం గమనార్హం.
- వీరవరం శివాలయం సమీపంలోనే పెద్ద ఎత్తున చెత్త కొండను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా గత మూడు రోజులుగా సదరు చెత్తకు నిప్పు పెట్టడంతో ఆలయానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- దుళ్ల బైపాస్‌రోడ్డులో ఉన్న చెత్త కొండలకు గత మూడు రోజులుగా నిప్పు పెడుతుండడంతో ఆయా ప్రాంతమంతా పొగతో నిండిపోతోంది. దీంతో ప్రయాణికులకు దారి కనిపించక ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సి వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం కోసం పంచాయతీ సిబ్బందే ఈ చెత్తకు నిప్పు పెట్టి ఉంటారన్న అభిప్రాయం బలంగా వినిపిస్తుంది.
- క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇంత అధ్వానంగా ఉండని, ఇప్పటికైనా ప్రచార ఆర్భాటాలను పక్కన పెట్టి వాస్తవ పరిస్థితులను మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. చెత్త నుంచి ఎరువుల తయారీని పకడ్బందీగా నిర్వహించడంతో పాటు, చెత్తను కాల్చకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



వీరవరం శివాలయం వెనక తగులబెడుతున్న చెత్త

ప్రతిభ చాటిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా థలసైనిక్ క్యాంప్(న్యూఢిల్లీ)–2024లో పాల్గొని ప్రతిభ చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం డిగ్రీ విద్యార్థులు సురేంద్రబాబు, లితేశ్వ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రవీణ్ కుమార్ దొర రాజమండ్రి, కర్నూల్, అనంతపురంల్లో ఏర్పాటు చేసిన 8 క్యాంప్‌లలో పాల్గొని అనేక వడబోతల తర్వాత చివరిదైన ఢిల్లీ క్యాంప్‌నకు ఎన్నికయ్యారన్నారు. అబ్స్టికల్ ట్రైనింగ్, టెంట్ పిచ్చింగ్, జడ్జింగ్ డిస్టెన్స్, ఫీల్డ్ సిగ్నల్ అనే అంశాలలో ఈ కేడెట్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ తరుపున పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపారని ప్రశంసించారు. కళాశాల ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ డాక్టర్ ఈసుబ్ బాషా షేక్, డాక్టర్ కె.అనూషలు పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి ఆటల పోటీలు

ప్రకాశం నగర్ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి అండర్–19 ఆటల పోటీలు పాఠశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఎస్.సుబ్రహ్మణ్యం, ఆర్ఐఓ ఎల్.నరసింహలు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు జనవరి ఒకటి 2006 తర్వాత పుట్టిన వారు మాత్రమే అర్హులన్నారు. పూర్తి వివరాలకు వ్యాయామ అధ్యాపకులు శివరామకృష్ణ 98481 76986 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలి



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో వసుంధర



విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న నాయకులు

డిప్యూటీ డీఎంహెచ్ఓ వసుంధర

ఆల్కాట్‌తోట(రాజమహేంద్రవరం రూరల్): ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలని, బాలబాలికల్లో రక్తహీనత రాకుండా ఉండేందుకు నులి పురుగుల నివారణకు ఏటా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వసుంధర అన్నారు. మంగళవారం నారాయణపురం మున్సిపల్ హైస్కూల్, అంబేడ్కర్ నగర్, వీఎల్‌పురం శ్యామలంబ ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వసుంధర మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో వివిధ శాఖల సమన్వయంతో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరుగుతుందన్నారు. మిగిలిన వారికి ఈ నెల 20వ తేదీన డీవార్మింగ్ మాత్రలు ఉచితంగా ఇస్తామన్నారు.

కంబాలచెరువు: స్థానిక రాజేంద్రనగర్‌లోని మండల పరిషత్ పాఠశాల, ఎస్పీ కచేరీ పాఠశాల, విజయదుర్గ కళాశాల విద్యార్థులకు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవీ వరప్రసాద్, గౌతమి జీవకారుణ్య సంఘం మాజీ ధర్మకర్తలు జక్కంపూడి అర్జున్, బళ్లా శ్రీనివాసరావులు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. కార్యక్రమంలో కొండిశెట్టి రామకృష్ణ, సచివాలయం హెల్త్ సెక్రటరీ శేషకుమారి, ఆశాకార్యకర్తలు కె.హవీలాకుమారి, ఎస్.మహారాణి, ఎ.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కడియం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలో కడియం, కడియపులంక పీహెచ్‌సీల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కడియం మండలంలో 12,565 మంది లక్ష్యానికి గాను 12,186 మంది విద్యార్థులకు మాత్రల పంపిణీ పూర్తయిందని వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్యవిస్తరణాధికారి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ధవళేశ్వరం విద్యార్థుల ప్రతిభ



కరాటే విజేతలతో ధవళేశ్వరం సీఐ గణేష్ తదితరులు

ధవళేశ్వరం: ఇటీవల ఏలూరులో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో 11 మంది విద్యార్థులు బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో ఉత్తీర్ణత పొందారు. విద్యార్థులు సాత్విక్, రోషన్, అరవింద్, కార్తిక్ బంగారు పతకాలను, హేమవల్లి, త్రివిక్రమ్, అభిరామ్ రజత పతకాలను, ప్రణల్, భవిత్, అశ్విన్, చాతుర్య కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. విజేతలను, శిక్షణ ఇచ్చిన మాస్టర్ కర్రి నాగిరెడ్డిని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ అభినందించారు. ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని సీఐ గణేష్ పేర్కొన్నారు. విజేతలకు స్థానిక నాయకులు సావాడ శ్రీనివాసరెడ్డి మెమోంటోస్ బహూకరించారు.

లండన్ యూనివర్సిటీకి ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర, అధ్యాపకులు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో బీఎస్సీ జెడ్‌సీ ఆక్వా గ్రూపునకు చెందిన ఇద్దరు విద్యార్థులు లండన్ యూనివర్సిటీలో ఎంబీఏ కోర్సుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.రామచంద్రయ్య మంగళవారం తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ రొంపెటన్ (లండన్)లో ఎంబీఏ(హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) కోర్సును అభ్యసించేందుకు కె.చంద్రిక, సంతోషిణిలు విదేశీ విద్యకు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, వైస్ ప్రిన్సిపాల్, జంతుశాస్త్ర విభాగపతి డాక్టర్ డి.శైలజ, ఇతర అధ్యాపకులు అభినందించారు.

చలో విజయవాడ విజయవంతం



చలో విజయవాడ కార్యక్రమంలో రాష్ట్ర నేతలతో జిల్లా పీహెచ్‌సీ వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: పీజీ వైద్య విద్యలో ఇన్‌సర్వీస్ కోటా కుదింపును వ్యతిరేకిస్తూ పీహెచ్‌సీ వైద్యులు మంగళవారం విజయవాడ ధర్నా చౌక్‌లో చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతమైందని పీహెచ్‌సీ వైద్యులు సంఘం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక అన్నారు. జీవో నంబరు 85కు వ్యతిరేకంగా, తమ ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలనే నినాదంతో వెయ్యిమందికి పైగా పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారన్నారు. వైద్యులంతా తమ హక్కులను కాపాడుకోవడమే లక్ష్యంగా ఆందోళన వ్యక్తం చేశారని చెప్పారు. జీవోనెంబరు 85ను వెంటనే రద్దు చేసి, తమ డిమాండ్లను ప్రభుత్వమే నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. కనీస వేతనాలు, పదోన్నతులు, ట్రైబల్ అలవెన్స్ తదితర సమస్యలపై ప్రభుత్వం హామీ ఇచ్చే వరకూ నిరసనలు కొనసాగుతాయన్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీల్లో సేవలు నిలిచిపోవడం వల్ల ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థపై భారీ ప్రభావం పడుతుందన్నారు. ప్రభుత్వంతో సవివరమైన చర్చలు జరిపినా, స్పెషల్ సీఎస్, కమిషనర్ హామీలు నెరవేర్చకపోవడం వల్లే నిరసన కార్యక్రమం చేపట్టవలసి వచ్చిందన్నారు.

మరింత బలోపేతం దిశగా ప్రణాళికలు



టీఎల్ఎం తయారు చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తున్న రమా రజని

కంబాలచెరువు: ప్రభుత్వం రానున్న రోజుల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తోందని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక దానవాయిపేట స్కూల్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులందరూ విధిగా విద్యార్థులకు చదవడం, రాయడం వచ్చేలా చూడాలన్నారు. ఒకటో తరగతి ఉపాధ్యాయులు విద్యాప్రవేశ్ 90 రోజుల కార్యాచరణ ప్రణాళిక సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సాల్ట్ కార్యక్రమం జిల్లా కో–ఆర్డినేటర్ ఆషిక్ అలీ కాంప్లెక్స్ సమావేశాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం సమావేశాలను అర్బన్ మండల ఎంఈవో–2 రమా రజని సందర్శించారు. ఉపాధ్యాయులు తయారుచేసిన బోధనోపకరణాలను చూసి అభినందించారు. సమావేశంలో కార్యదర్శి పరస జగన్నాథరావు, కాంప్లెక్స్ రిసోర్స్ టీచర్స్ జయంతి శాస్త్రి, కోటేశ్వరి, విషయ నిపుణులు వరహాగిరి కృష్ణమోహన్, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో గోదావరిలో దూకిన మహిళ

రాజమహేంద్రవరం రూరల్: కుటుంబ కలహాలతో గోదావరిలో దూకిన మహిళను జాలర్లు కాపాడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పిడింగొయ్యి బుచ్చియ్యనగర్‌కు చెందిన బి.కామాక్షి అనే మహిళ కుటుంబ కలహాల నేపథ్యంలో రోడ్డుకం రైలు బ్రిడ్జి పైనుంచి గోదావరిలోకి దూకేసింది. ఇది గమనించిన వాహనదారులు 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు స్థానికంగా ఉన్న మత్స్యకారులకు తెలియజేశారు. గోదావరి నీటిపై తేలియాడుతున్న మహిళను జాలర్లు పడవ పైకి లాగి ప్రాణాలతో కాపాడగలిగారు. జాలర్లు ఒడ్డుకు చేర్చిన మహిళను టూటౌన్ పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె భర్త రాజును పిలిపించి విచారించగా కుటుంబకలహాల నేపథ్యంలోనే తన భార్య గోదావరిలో దూకినట్లు అతడు తెలిపాడు. టూటౌన్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు ఆధ్వర్యంలో రాజు, కామాక్షి దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

ఆయిల్ దుకాణాలపై తొమ్మిది కేసులు నమోదు

రాజమహేంద్రవరం రూరల్: వంట నూనెల ధరలు, నిల్వలపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలలో పలు దుకాణాలపై విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి దాడులు చేశారు. జిల్లాలోని మూడు హోల్‌సేల్, రెండు రిటైల్ ఎడిబుల్ ఆయిల్ దుకాణాలను, కాకినాడ జిల్లాలోని రెండు హోల్‌సేల్, ఒక రిటైల్ ఎడిబుల్ ఆయిల్ దుకాణాన్ని తనిఖీ చేసి నిబంధనలు విరుద్ధంగా ఉన్న కారణంతో తొమ్మిది కేసులు నమోదు చేశారు. రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కెఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తున్న, కృత్రిమ కొరత సృష్టిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూనెల ధరల్లో, నిల్వల్లో అక్రమాలకు పాల్పడేవారిపై 8008203261కు ఫోన్‌చేసి తనకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తెలుగు సాహిత్యంలో సుకవులు



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కడియం: తెలుగు సాహిత్యంలో మరువలేని రచనలు చేసిన గురజాడ అప్పారావు, గుర్రం జాషువా, తాపీ ధర్మారావులు ముగ్గురూ సుకవులేనని తెలుగు ఆర్పీ గొల్లపల్లి సత్యనారాయణ కొనియాడారు. రెండు మండలాల తెలుగు ఉపాధ్యాయుల పాఠశాలల సముదాయం ఒక రోజు శిక్షణా కార్యక్రమం కడియం ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సముదాయం కార్యదర్శి టి.సత్యనారాయణ కవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు ఏసుబాబు జాషువా పద్యాలను ఆలపించగా, సుదర్శనం తాపీవారి శాస్త్రీయ దృక్పథం, సంపాదకుడిగా వారి సేవలను వివరించారు. గురజాడ పూర్ణమ్మ గేయాన్ని కె. రమణమ్మ అద్భుతంగా ఆలపించారు. కార్యక్రమంలో ఎంఈఓలు వై.నాగేశ్వరరావు, పి.మణికుమార్, రెండు మండలాలకు చెందిన 48 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజాయితీకి నిలువుటద్దం వావిలాల



గోపాలకృష్ణయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సమితి సభ్యులు

సీటీఆర్ఐ: తెలుగు జాతి చరిత్రలో వావిలాల గోపాలకృష్ణయ్య మహోన్నత రాజకీయ నాయకుడని, నిజాయితీకి నిలువెత్తు సాక్ష్యమని ఆంధ్ర కేసరి యువజన సమితి సీనియర్ సభ్యులు, ఆడిటర్ బీఎస్ శర్మ అన్నారు. వావిలాల గోపాలకృష్ణయ్య 118వ జయంతోత్సవాన్ని ఆంధ్ర కేసరి డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వావిలాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమితి కార్యదర్శి మాదిరాజు మాట్లాడుతూ 14 ఏళ్ల వయసులో 9వ తరగతి చదువుకి స్వస్తి చెప్పిన వావిలాల ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. నాలుగుసార్లు శాసనసభ్యులుగా పని చేసి కళా ప్రపూర్ణ, పద్మ విభూషణ అవార్డులు పొందారన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు దేశ్ రెడ్డి బలరామ నాయుడు, సమితి పూర్వ అధ్యక్షురాలు కోసూరు చండీప్రియ, కళాశాల కార్యదర్శి శ్రీకాకుళం నరసింహరావు, సమితి సభ్యులు రఘుపతి సాయిబాబా, సమితి కోశాధికారి గుడిపూడి గౌతమ్, ప్రిన్సిపాల్ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో భోజనాల వితరణ

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని మోదీ జన్మదినోత్సవం సందర్భంగా నగరంలో బీజేపీ నాయకులు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా స్థానిక క్వారీ సెంటర్‌లో మొక్కలను నాటారు. అనంతరం స్థానిక అన్న క్యాంటీన్‌లో భోజనాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచంలోనే మూడో ఆర్థిక శక్తిగా మలిచేందుకు ప్రధాని నరేంద్రమోదీ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ మహా యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, ఉపాధ్యక్షుడు కోడూరు లక్ష్మీనారాయణ, అడబాల రామకృష్ణ, కాలెపు సత్యసాయిరామ్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని బీజేపీ రూరల్ అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు ఆధ్వర్యంలో బొమ్మూరులోని వివేకానంద ఆరోగ్య కేంద్రం ఆవరణలో సూర్య భగవాన్ మందిరంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వృద్ధులకు, దివ్యాంగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పన్నాల వేంకట లక్ష్మి, జిల్లా కార్యదర్శి తను బుద్ధి సూర్య భాస్కర రావు, గండేపల్లి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ మంగళవారం ప్రకటించారు. నగరంలోని 5వ నంబర్ బస్‌స్టాండ్, కోరుకొండ రోడ్, రాజా థియేటర్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకూ, పనసచెట్టు సెంటర్, సంజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, సాయినగర్, ఏవీ అప్పారావు రోడ్, సాయి టవర్స్, నేతాజీ టవర్స్, బాలాజీ స్ట్రీట్, శారద నగర్, షీలా నగర్, గోపాలనగర్ పుంత, శ్రీనివాస గార్డెన్, అద్దేపల్లి కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ ఉండదన్నారు.

వరద బాధితులకు విరాళం

కడియం: విజయవాడ వరద బాధితులకు వేమగిరి వాసులు భారీ విరాళం ఇచ్చారు. వేమగిరి మాజీ సర్పంచ్ డాక్టర్ వెలుగుబంటి వెంకటాచలం రూ.లక్ష, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్ రూ.25 వేలు, వేమగిరి గ్రామస్తులు రూ.3,14,000 విరాళంగా సమకూర్చారు. ఈ మొత్తాన్ని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి సోమవారం అందజేశారు.